మామిడి పూత.. దిగుబడిపై ఆశ


పూత దశలో ఉన్న మామిడి చెట్లు

- సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు
- మంచుతో పంటకు ముప్పు
- రైతుల్లో కలవరం
- రంపచోడవరం డివిజన్ హార్టీకల్చర్ అధికారి రమేష్ సూచనలు

రాజవొమ్మంగి: మండలంలో మామిడి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఏడు మండలాలు గల రంపచోడవరం డివిజన్‌లో 879 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. అత్యధికంగా దేవీపట్నంలో(529 ఎకరాల్లో) మామిడి సాగవుతుండగా అత్యల్పంగా చింతూరు మండలంలో (కేవలం ఒక ఎకరం విస్తీర్ణంలో మాత్రమే) మామిడి తోటలున్నాయి. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో పంట పూత దశకు చేరుకుంది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గడిచిన రెండేళ్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఈ ఏడాది పంట సాగు చేపట్టారు. మామిడి పూత కూడా బాగుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న మంచుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత దెబ్బతినే అవకాశాలున్నాయని భయపడుతున్నారు.

లాభాలకు సస్యరక్షణ ప్రధానం

మామిడిలో మంచి దిగుబడి, లాభాలను అర్జించాలంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రంపచోడవరం డివిజన్ హార్టీ కల్చర్ ఆఫీసర్ ఎస్.రమేష్ అన్నారు. ఇటీవల దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా పూత మాడిపోవడమే కాక, తెగుళ్ల విజృంభిస్తాయని చెబుతున్నారు. మామిడిపై ప్రధానంగా తేనెమంచు పురుగు, కాయలపై తామరపురుగు, కాయతొలుచు పురుగు, బూడిద తెగులు ప్రధానంగా చెప్పారు. మామిడిలో తెగుళ్లు, పురుగులు ఆశించనప్పుడు 9573847315 నంబర్‌కు సంప్రదిస్తే తగిన సూచనలిస్తానని రమేష్ తెలిపారు. వీటి నివారణ చేపట్టకపోతే నష్టం తప్పదన్నారు. తెగుళ్ల నివారణకు ఆయన తెలిపిన సూచనలివి..


రమేష్

➡ మామిడి పిందె, పూత దశలో నష్టం కలిగించే తామర పురుగునివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్, లేదా ఎసిఫేట్ పొడి మందు 1.5 గ్రాములు, లేదా డైబిథోయేట్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి మొక్క అంతా తడిసేలా పిచికారీ చేయాలి. తేనె మంచు పురుగు వల్ల కూడా మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు మోనో క్రోటోఫాస్ 1.5 ఎంఎల్, లేదా డైమిథియేట్ 2.5 ఎంఎల్, లేదా క్లోరిఫైర్‌పాస్ 2.5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి కొమ్మలు అన్నీ తడిసేలా పిచికారీ చేయాలి. ఆకుజల్లెడ పురుగువల్ల కూడా మామిడిలో నష్టాలు ఏర్పడతాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ మందు పిచికారీ చేసి నివారించవచ్చు. కాయలపై మచ్చలు వచ్చేందుకు యాంత్రోక్నోస్ కారణం. దీని నివారణకు పూత దశలోనే ప్రొపికోనోజోల్ పిచికారీ చేసుకోవాలి.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్గానిక్ మామిడిపండ్లకు డిమాండ్

రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో పండించిన మామిడికి మాత్రమే దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంది. మన ప్రాంతానికి చెందిన మామిడి పండ్లు, కాయలు ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా సేంద్రియ పద్ధతులతోనే మామిడి సాగు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

మామిడిలో ప్రధాన రకాలు

ఎగుమతి, ప్రోసెసింగ్‌కు అనువైన మామిడి రకాల్లో తోతాపురి (చిత్తూరు/కలెక్టర్), బంగినపల్లి, నీలం, మల్లిక, సువర్ణరేఖ, నీలేషాన్(నీలం) పెద్దరసం, చెరకురసం, కొత్తపల్లి కొబ్బరి, పందూరు మామిడి, గోవ తదితర ప్రధానమైనవి.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్ర వారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో పార్టీ శ్రేణులు సమన్వయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అరకు నియోజకవర్గంలోని ఆరు మండలా ల్లో జరుగుతున్న గృహ సారథులు, కన్వీనర్ల సమావేశాలు విజయవంతం అవుతుండడంతో నియోజకవర్గ పార్టీ పరిశీలకులకు కొండపల్లి కొండబాబు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, అందరికీ పథకాలు అందేలా చూడాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, గృహ సారథులు, కన్వీనర్లు సమష్టిగా, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్, సర్పంచ్ ఉపేంద్ర, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, నాయకులు నర్సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

రెగ్యులర్ అధికారులను నియమించాలి

చింతూరు: ఐటీడీఏ పీవో, చింతూరు సబ్ కలెక్టర్ పోస్టులకు రెగ్యులర్ అధికారులను నియమించాలని బీజేపీ నాయకులు అన్నారు. చింతూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇన్‌చార్జి అధికారుల పాలనతో నాలుగు మండలాల్లో సమస్యల పరిష్కారంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రెగ్యులర్ అధికారుల ఆవశ్యకత ఉందని వారు తెలిపారు. నాయకులు వెంకయ్య, దారయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

98 మందికి వైద్య పరీక్షలు


బాలుడికి వైద్య పరీక్షల చేస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు: దారకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యాధికారి డీకే హిమబిందు పరమ శింగవరంలో 98 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు తరచూ ఆసుపత్రికి వచ్చి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలన్నారు. ముర్ల మల్లేష్ అనే 15 ఏళ్ల బాలుడు పొట్ట ఉబ్బిపోయి తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రికి రాగా పరీక్షలు చేసి, మందు అందజేశారు.


తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు


మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు, పక్కన ఎంపీడీవో వెంకటరావు, జేఈఈ రమేష్

హుకుంపేట: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో బోర్లు, బావులు, ఊటల్లో నీరు తగ్గిపోయే అవకాశం ఉందని , అలాంటి సమస్యలను ముందుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో మోటార్, బోర్లు పాడైతే ముందుగా సమాచారం అందిస్తే మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద మంజూరైన గ్రామలకు వెంటనే కుళాయిల ఏర్పాటుకు పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో మంచినీరు సమస్య లేకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఎంపీడీవో వెంకటరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. పట్టించుకోరూ..

- ఘాట్‌రోడ్డులో రాకపోకలకు అడ్డంకిగా మారిన దగ్ధమైన బస్సు
- వాహనచోదకులకు ఇక్కట్లు


రెండు నెలలుగా ఘాట్‌రోడ్డులో దర్శనమిస్తున్న దగ్ధమైన బస్సు

అనంతగిరి: దగ్ధమైన బస్సును తరలించాలని వాహనచోదకులు కోరుతున్నారు.. రెండు నెలల క్రితం విజయనగరంలోని గొల్లాలపేటకు చెందిన కొంత మంది పర్యాటకులు రణదీప్ ట్రావెల్స్ బస్సులో అరకు అందాలకు తిలకించి, తిరిగి ప్రయాణంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డు తైడ సమీపంలోని మలుపువద్ద ప్రమాదవశాత్తూ బస్సు దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదంలోని పర్యాటకులు సురక్షితంగా బయటపడ్డారు. అప్పటి నుంచి ఘాట్‌రోడ్డులోని దర్శనమిస్తోంది. మలుపు కావడంతో పెద్ద వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించి, వాహనం తొలగించే ఏర్పాట్లు చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ సరసుపాడు, అనంతగిరి మండల సొనభ గ్రామా ల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం శుక్రవా రం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో శివారు గ్రామా ల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలను తనకు తెలియజేస్తే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు లక్ష్మయ్య, చందనాపాత్రుడు, ఎంపీటీసీ సభ్యురాలు సింహాచలం, నాయకులు భూపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: శాసన మండలి సభ్యుల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ కె.బాపన్నదొర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన కారణంగా ఎన్నికల కోడ్ అమల్లోనికి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ ఈనెల 9 నుంచి మార్చి 21 వరకూ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నియమ, నిబందనలు అతిక్రమించకుండా గ్రామస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారుల అదేశాలను పాటిస్తూ పని చేయాలని సూచించారు. నిబందనలు అతిక్రమణ ఎక్కడైనా జరిగినట్లు అయితే కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

రాజవొమ్మంగి: త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ నిబంధనలు విడుదల అయ్యాయని, వాటిని అతిక్రమించ రాదని ఎంపీడీఓ బాపన్నదొర అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీలు నిర్వహించే సభలకు అధికారులు వెళ్లకూడదని, అలాగే అధికారులను ప్రజాప్రతినిధులు కలవకూడదన్ని నిబంధనలున్నాయన్నారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. నాయకులున్న ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఈనెల 9 నుంచి మార్చి 21వరకు అమలులో వుంటాయన్నారు.

ప్రచార కరపత్రాల ఆవిష్కరణ

జి.మాడుగుల: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సలుగు సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను కేంద్ర కాఫీ బోర్డు నెంబర్, బిజెపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ మాధవ్‌ను మరలా ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. రాజారావు, కృష్ణారావు, బాలయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయడం హర్షణీయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలన దేశానికే ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీలో ప్రతి పంచాయతీకు రూ.20లక్షల నిధులు కేటాయిస్తోందని, అయితే నిధులను రూ.40లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీంతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా ఊహించని రీతిలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేయడం చరిత్రాత్మకమన్నారు. ప్రభుత్వ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, సర్పంచ్‌లు రమేష్, ఉపేంద్ర, మార్కెట్ కమిటి డైరెక్టర్ గురు, నర్సింగ్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో గ్రామాలకు రహదారులు

పాడేరు రూరల్ : మండలంలోని అత్యంత మారుమూల గ్రామ పంచాయతీలైన ఐనాడ, సలుగు, దేవాపురం, వంట్లమామిడి పరిధిలోని గ్రామాల్లో రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించిన ఘనత పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నారు. పాడేరులో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 12వ మైళ్ల జంక్షన్ నుంచి దేవాపురం వరకు రోడ్డును టీడీపీ హయంలో వేశామని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. గతంలో ఆయా పంచాయతీల గిరిజనులు రోడ్డు మంజూరు కోసం గిడ్డి ఈశ్వరిని కలిస్తే రోడ్లు వేస్తేనే ఓట్లు వేస్తారా లేదంటే వేయరా అని స్థానిక గిరిజనులకు హేళన చేసి మాట్లాడిన సంగతి తెలిసేందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి 12వ మైళ్ల నుంచి దేవాపురం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుతం రహదారి పనులు చివరి దశలో ఉందన్నారు. రోడ్డు ఎవరి హయాంలో జరుగుతుందనే సంగతి ఆయా గ్రామాల గిరిజనులకు తెలుసునన్నారు. ఇకనైనా టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సర్పంచ్‌లు భీమలమ్మ, కిల్లు పరమేశ్వరి, పాంగి రాంబాబు, సలుగు, ఎంపీటీసీలు ఎర్రయమ్మ, చిప్పాడ మీనా, చిట్టమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాంబాబు, పక్కన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ఇంత నిర్లక్ష్యమా!

- నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్లు
- కొరవడిన నిర్వహణ

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. పథకాల నిర్వాహణ లోపం కారణంగా పాఠశాలల్లో పథకాలు మూలకు చేరడంతో విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. మండలంలోని దుప్పులవాడ, గూడెంకొత్తవీధి, సీలేరు, సప్పర్ల, ఆర్‌వీ నగర్, గూడెంకాలనీ, రింతాడ, జర్రిల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేకపోవడంతో వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారినట్టు పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిని వినియోగంలో కి తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. విద్యార్థులకు తాగునీరు అందించేందుకు పాడైన ప్లాంట్లు బాగు చేయిస్తామన్నారు.


దుప్పలవాడ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం


- చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ
- వ్యవసాయ సలహామండలి సమావేశం ఏర్పాటు

కొయ్యూరు: ఐక్యరాజ్య సమితి ఈ యేడాది చిరుధాన్యాల సంవత్సరంగా(మిల్లెట్ ఇయర్) ప్రకటించిన నేపథ్యంలో మిల్లెట్స్‌కు గిరాకీ పెరిగిందని, గిరిరైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ కోరారు. చీడిపాలెం పంచాయతీ సింగవరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రస్తుతం మిల్లెట్స్ వినియోగం పెరిగిందన్నారు. తక్కువ నీరు లభించే ప్రాంతాల్లో సైతం సాగు చేయవచ్చన్నారు. చిరుధాన్యాల్లో ఎక్కువ పోషక విలువలున్నట్టు నిపుణులు నిర్ధారించినట్టు తెలిపారు. సాధారణ పంటలతో పాటు చిరుధాన్యా ల సాగుపై దృష్టి సారించాలన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులను వినియోగించకుండా సేంద్రియ వ్యవసాయం చేయాలని కోరారు. దీంతో ప్రజలకు ఆరోగ్య రక్షణతో పాటు భూసారం దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో కృష్ణవేణి మాట్లాడుతూ పీఎవో కిసాన్ లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న కస్టమర్ హైరింగ్ కేంద్రంలో రైతులు గ్రూపుగా ఏర్పడితే 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలను అందజేస్తామన్నారు. సభ్యులు జాహ్నవి, పి.అచ్యుతరామ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజులమ్మ

అందుబాటులో వ్యవసాయ యంత్రాలు

గూడెంకొత్తవీధి: మన్యంలో వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గిరి రైతులు వ్యవసా య పనుల్లో సంప్రదాయ పద్ధతులు పాటించే వారు. దీంతో ఖర్చుతో పాటు శ్రమ ఎక్కువడంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాల వినియోగంపై దృష్టి సారించారు. ప్రభుత్వం గిరి రైతులకు యంత్రాల ను పంపిణీ చేస్తుండంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో కస్టమర్ హైరింగ్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. ఈ మేరకు రైతులు సాగులో యంత్రాలను వినియోగిస్తున్నారు. మండలంలోని చాలా ప్రాంతాల్లో వరి నూర్పిళ్లను యంత్రాలతో చేపడుతున్నారు.


వరి నూరుస్తున్న యంత్రం

ఆశ్రమ హెల్త్ వలంటీర్ల నిరసన

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో విధులు నిర్వహించిన కాంట్రాక్ట్ హెల్త్ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు ఐటీడీఏ ఎదుట హెల్త్ వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని తక్షణమే హెల్త్ వలంటీర్లను నియమించాలని, బకాయి పడిన నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ప్రజా రాధాకృష్ణ, రాజబాబు, లక్ష్మణ్, వెంకటరావు, శాంతి, చంద్రకళ, సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ఐటీడీఏ ఎదుట నిరసన చేస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల హెల్త్ వలంటీర్లు

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: తేనెటీగలు దాడి చేయడంతో శుక్రవారం ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన పి.అబ్బాయి రెడ్డి తన కొండపోడు పోలంలో పనిచేస్తుండగా సమీప అటవీలో నుంచి తేనెటీగలు వచ్చి అతడిపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అబ్బాయి రెడ్డిని బంధువులు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ సలహాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏవో మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు వ్యవసాయ సలహాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి మధుసూదనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యవసాయ సలహాలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. భూములకు అనువైన పంటలు వేసుకోవాలన్నారు.పలువురు అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కొయ్యూరు: కొండగోకిరిలో లోకులగాంధీ స్మారక టోర్నీలో భాగంగా వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీకృష్ణ మాట్లాడుతూ టోర్నీలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 టీమ్‌లు పాల్గొన్నట్టు చెప్పారు. రోజూ నాలుగు నుంచి ఐదు మ్యాచ్‌లు జరుగుతున్నాయన్నారు. ఈనెల 16వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

రోలుగుంట: గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వడ్డాది-నర్సీపట్నం రోడ్డులో హనుమాన్ ఆలయం నుంచి వినాయకుని ఆలయం వరకు, వీధుల్లోనూ విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తులు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ సర్పంచ్ దునియా భాస్కర్‌రావు తల్లి దురియా రేఖమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామంలో జరిగిన ఆమె సంతాప సభలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేఖమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ భాస్కరరావును పరామర్శించారు. అనంతరం చినలబుడులోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంబ, రామన్న, రంజిత్‌కుమార్,సంపత్‌కుమార్, రమేష్, దేవదాస్, రామన్న, బాలరాజు, గురు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి

చింతూరు: స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్త నమూనాలు సేకరించడంతో పాటు అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఫ్రైడే, డ్రైడేలో భాగంలో పాఠశాల, కళాశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, మురికి కాలువలు పూడ్చడంతో పాటు దోమతెరలు వినియోగించాలని వైద్యాధికారి సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

రాజవొమ్మంగి: మండలంలోని ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్చి 15 నుంచి జరుగనున్న పరీక్షల నిర్వహణకు ఒకేషనల్ ఎడ్యూకేషనల్ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకొంటోంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు జరుగనున్న ప్రాక్టికల్స్‌కు కూడా ఆయా కళాశాలల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.